## ఇన్‌చార్జి డీఎంహెచ్‌ఓగా కళ్యాణ్‌చక్రవర్తి బాధ్యతల స్వీకరణ

ఇన్‌చార్జి డీఎంహెచ్‌ఓగా బాధ్యతలు స్వీకరిస్తున్న కళ్యాణ్‌చక్రవర్తి

నీలగిరి, జూన్ 1 : జిల్లా ఇన్‌చార్జి డీఎంహెచ్‌ఓగా డాక్టర్ కళ్యాణ్‌చక్రవర్తి శనివారం బాధ్యతలు చేపట్టారు. డీఎంహెచ్‌ఓ అన్నిమళ్ల కొండల్‌రావు ఉద్యోగ విరమణ పొందడంతో ఆయన స్థానంలో కళ్యాన్‌చక్రవర్తిని ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు ఆయన కలెక్టర్ దాసరి హరిచందనను మర్యాద పూర్వకంగా కలిసిన అనంతరం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని విభాగాలను సమన్వయం చేసుకుంటూ జిల్లాను వైద్య రంగంలో ముందంజలో ఉంచేందుకు కృషి చేస్తానన్నారు.

## విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా పాఠ్య పుస్తకాలు సిద్ధం

● డీఈఓ భిక్షపతి

దుగినవెల్లి పీఎస్‌లో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న డీఈఓ భిక్షపతి

కట్టంగూర్, జూన్ 1 : విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా పాఠ్యపుస్తకాలు సిద్ధంగా ఉన్నాయని డీఈఓ బొల్లారం భిక్షపతి అన్నారు. శనివారం కట్టంగూర్ విద్యా వనరుల కేంద్రంలో జరిగిన పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని ఉపాధ్యాయులకు పుస్తకాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలు పునఃప్రారంభం నాటికి అన్ని పాఠశాలలకు పాఠ్యపుస్తకాలు అందజేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదును పెంచడానికి కృషి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం దుగినవెల్లి, ముత్యాలమ్మగూడెం ప్రాథమిక పాఠశాలల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయన వెంట ఎంఈఓ మేకనాగయ్య, ఏఈ వెంకటనర్సయ్య, మండల నోడల్ అధికారి అంబటి అంజయ్య, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఉన్నారు.

## రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలి

● ఏడీఏ రామారావు నాయక్

కరపత్రాలు విడుదల చేస్తున్న అధికారులు

కట్టంగూర్/చిట్యాల, జూన్ 1 : విత్తన డీలర్లు రైతులకు నాణ్యమైన విత్తనాలను అందించాలని నకిరేకల్ ఏడీఏ రామారావు నాయక్ ఆదేశించారు. శనివారం కట్టంగూర్, చిట్యాలలోని రైతువేదికల్లో విత్తన డీలర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎరువులు, పురుగుల మందులు రైతులకు అందుబాటులో ఉంచాలన్నారు. విత్తనాలు, ఎరువులకు ఎమ్మార్పీకే విక్రయించాలన్నారు. బిల్స్, స్టాక్ వివరాలు తప్పని సరిగా రోజువారీగా నమోదు చేయడంతో పాటు ఈ పాస్ ద్వారానే విక్రయించాలని సూచించారు. విత్తన డీలర్లు నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వానకాలం సీజన్‌కు సరిపడా పత్తి, వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. రైతులు అనుమతి ఉన్న విత్తన దుకాణాల్లోనే కొనుగోలు చేయాలని, బిల్లు తీసుకొని భద్రపర్చాలని సూచించారు. చిట్యాల ఎస్ఐ లింగయ్య మాట్లాడుతూ విత్తనాలు విడిగా అమ్మినా, నకిలీవి అమ్మినా పీడీ యాక్ట్ కింద కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో మండల వ్యవసాయ అధికారులు శివరాంకుమార్,గిరిబాబు, ఏఈఓలు రమ్య, శృతి పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పనుల్లో అవకతవకలకు పాల్పడితే చర్యలు

● జిల్లా అడిషనల్ డీఆర్‌డీఓ నవీన్

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అడిషనల్ డీఆర్‌డీఓ నవీన్

నార్కట్‌పల్లి, జూన్ 1 : జాతీయ ఉపాధి హామీ పనుల్లో అవకతవకలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని జిల్లా అడిషనల్ డీఆర్‌డీఓ నవీన్ హెచ్చరించారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఉపాధిహామీ పథకం 14వ విడుత సామాజిక తనిఖీ నిర్వహించారు. ఏప్రిల్ 2023 నుంచి మార్చి 2024 వరకు మండలంలో రూ.3,93,35,527 ఖర్చు చేసినట్లు సామాజిక తనిఖీలో తేల్చారు. ఉపాధి పనుల నిర్వహణలో వచ్చిన ఆరోపణలపై విచారణ చేపట్టారు. సిబ్బంది సక్రమంగా పని చేయాలని, కూలీలకు పనులు కల్పించే విషయంలో తప్పులు దొర్లితే సహించేది లేదన్నారు. పనులు పారదర్శకంగా నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీపీఓ వేణుగోపాల్, ఎంపీడీఓ ఉమేశ్, ఎంపీఓ సుధాకర్, ఎస్ఆర్‌పీ తిరుపతి, ఏపీఓ యాదయ్య, ఉపాధిహామీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## క్రీడాకారులకు సర్టిఫికెట్లు

శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్లు అందిస్తున్న వైస్ ఎంపీపీ దిలీప్‌రెడ్డి

తిరుమలగిరి (సాగర్), జూన్ 1: జిల్లా యువజన క్రీడలశాఖ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో నిర్వహించిన వేసవి వాలీబాల్ శిక్షణ శిబిరంలో శిక్షణ పూర్తి చేసుకున్న క్రీడాకారులకు శనివారం వైస్ ఎంపీపీ ఎడవెల్లి దిలీప్‌రెడ్డి సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుసిరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నెల రోజులపాటు విద్యార్థులకు శిక్షణ శిబిరం నిర్వహించినట్లు చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బుర్రి రాంరెడ్డి, పీఈటీ నరసింహారావు, నాయకులు నక్క సైదిరెడ్డి, గౌతమ్‌రెడ్డి, పరమేశ్, బ్రహ్మం, సాహిబ్, వీరారెడ్డి, నితిన్ పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS
WANTED
★త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073.
NT-327724-All
గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం... మన "నమస్తే తెలంగాణ" క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం...
ప్రతి 4 లైన్ల క్లాసిఫైడ్‌కు 200/-
ప్రతి అదనపు లైన్‌కు 50/-
Note: 3+1 Scheme Available
Minimum 4 Lines, Extra Line - Extra Amount
నమస్తే తెలంగాణ యూనిట్ కార్యాలయం,
సల్లగొండ : 9182777626 | సల్లగొండ : 9182777635 | దేవరకొండ : 9182777635
హుజూర్‌నగర్ : 9182777059 | సూర్యాపేట : 9182777630 | ఉమ్మడి నల్గొండ : 9182777630
మిర్యాలగూడ : 9182777059 | కోదాడ : 9182777196 | భువనగిరి : 9182777630

## గ్యాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు జాగ్రత్తగా నిర్వహించాలి

● రిటర్నింగ్ అధికారి, నల్లగొండ కలెక్టర్ హరిచందన

ఎమ్మెల్సీ ఉప ఎన్నికల లెక్కింపుపై నల్లగొండ కలెక్టరేట్‌లో అధికారుల నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ దాసరి హరిచందన

నీలగిరి, జూన్ 1 : వరంగల్-ఖమ్మం-నల్లగొండ శాసన మండలి పట్టభద్రుల ఉప ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ జాగ్రత్తగా నిర్వహించాలని రిటర్నింగ్ అధికారి, నల్లగొండ కలెక్టర్ దాసరి హరిచందన అన్నారు. కలెక్టర్ కార్యాలయంలోని ఉదయాదిత్య భవన్‌లో శనివారం ఎమ్మెల్సీ ఎన్నికలు జరిగిన 12 జిల్లాల అదనపు కలెక్టర్లు, ఆర్డీఓలు, ఏఆర్‌ఓలకు ఓట్ల లెక్కింపుపై శిక్షణ నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపు మొదటి రౌండ్ చాలా ముఖ్యమన్నారు. ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు, ఏజెంట్ల ఎదురుగా బ్యాలెట్ బాక్స్‌ల సీల్ తీయాలని, అవసరమైన మెటీరియల్ అన్నింటినీ వారి ఎదురుగానే నిర్వహించాలని తెలిపారు. కౌంటింగ్ కేంద్రంలోకి అభ్యర్థులు, ఏజెంట్లు ఇంకు పెన్నులు, వాటర్ బాటిళ్లు, సెల్ ఫోన్ వంటివి తీసుకురావడానికి వీలులేదని చెప్పారు. నల్లగొండలోని దుప్పలపల్లి గోదాములోని 4 హాళ్లలో ఓట్ల లెక్కింపు చేపడుతామని, ఇందుకోసం 96 టేబుళ్లు ఏర్పాటు చేశామని, ఒక్కో హాల్‌లో 24 టేబుళ్లు ఉంటాయని చెప్పారు. ఉదయం 6 గంటలకు ఓట్ల లెక్కింపు సిబ్బంది కేంద్రం వద్ద హాజరు కావాలని, ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుందని అన్నారు. ప్రతి హాల్‌కు అదనపు కలెక్టర్, ఒక ఏఆర్‌ఓ ఇన్‌చార్జిగా ఉంటారని, ఆర్టీఓ స్థాయి అధికారులు ఇద్దరు ఉంటారని, 12 టేబుళ్లకు ఒక ఆర్డీఓ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తారని తెలిపారు. కౌంటింగ్ సూపర్‌వైజర్లకు ఇదివరకే శిక్షణ ఇచ్చామని, మరోసారి 3వ తేదీన శిక్షణ ఇవ్వనున్నామని వెల్లడించారు. మొదటి రౌండ్ షిఫ్ట్ డ్యూటీలో ఉన్నవారు, రెండో షిఫ్ట్ ఉద్యోగులు వచ్చిన తర్వాతే బయటకు వెళ్లాల్సి ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా టేబులేషన్, ఓట్ల లెక్కింపు, రిపోర్టులు, మొదటి రౌండు కౌంటింగ్ అంశాలపై మాట్లాడారు. ఓట్ల లెక్కింపులో తేడా రాకుండా చూసుకోవాలన్నారు. మూడు రౌండ్ల వరకు పూర్తి స్థాయిలో బండిల్స్ లెక్కిస్తారని, నాలుగో రౌండ్ సైతం ఉంటుందని అంచనా వేస్తున్నామని చెప్పారు. పోస్టల్ బ్యాలెట్ అన్నింటినీ కలుపుకొని బ్యాలెట్ పేపర్ లెక్కించాల్సి ఉంటుందని, చెల్లుబాటు ఓట్లు, చెల్లుబాటు కాని ఓట్లను జాగ్రత్తగా పరిశీలించి లెక్కించాలని తెలిపారు. ఈ సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, 12 జిల్లాల అదనపు కలెక్టర్లు, ఆర్డీఓలు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

### ఓట్ల లెక్కింపునకు సహకరించాలి

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఉప ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు అభ్యర్థులు, రాజకీయ పార్టీలు పూర్తి సహాయ సహకారాలు అందించాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి దాసరి హరిచందన కోరారు. కలెక్టరేట్‌లో శనివారం ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు, వారి ఏజెంట్లతో కౌంటింగ్ ప్రక్రియపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ మొత్తం 96 టేబుళ్లలో ఓట్ల లెక్కింపు ఉంటుందని, ఒక్కో టేబుల్‌కు ఒక ఏజెంటును అభ్యర్థులు నియమించుకోవచ్చన్నారు. రిటర్నింగ్ అధికారి టేబుల్ వద్ద ఒక ఏజెంట్ లేదా అభ్యర్థిగాని ఉండవచ్చని తెలిపారు. ఈ నెల 2వ తేదీలోపు ఏజెంట్ల పేర్లు, ఫొటోలు ఇచ్చి ఐడెంటిటీ కార్డులను తీసుకోవాలని చెప్పారు. ఈ నెల 5న ఉదయం 6 గంటలకు అభ్యర్థులు, వారి ఏజెంట్లు స్ట్రాంగ్ రూమ్ దగ్గర హాజరు కావాలని తెలిపారు. ఎన్నికల ఏజెంట్లు పెన్సిళ్లు, జెండాలు, పార్టీ గుర్తుల వంటివి ధరించి కౌంటింగ్ హాల్లోకి రాకూడదన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్‌తోపాటు, అదనపు కలెక్టర్లు, ఆర్డీఓలు, ఏఆర్‌ఓలు నల్లగొండ దుప్పలపల్లి గోదాము వద్ద ఏర్పాటు చేసిన ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలించారు.

## ఘనంగా శివాలయ వార్షికోత్సవం

అన్నదానం నిర్వహిస్తున్న దాతలు

త్రిపురారం, జూన్ 1: మండల కేంద్రంలోని శివాలయ మొదటి వార్షికోత్సవ వేడుకలు శనివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే శివుడికి పంచామృతాభిషేకాలు, రుద్రాభిషేకాలు నిర్వహించారు. మండల కేంద్రంతోపాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారి కల్యాణం అనంతరం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ అనుముల పాండమ్మశ్రీనివాస్‌రెడ్డి, ఆలయ ధర్మకర్త ఎల్ల య్యస్వామి, ప్రధానార్చకుడు లోకేశ్‌శర్మ, బీఆర్ఎస్ మండల మాజీ అధ్యక్షుడు అనుముల శ్రీనివాస్‌రెడ్డి, నిడమనూరు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మర్ల చంద్రారెడ్డి, నగిరి వెంకన్న పాల్గొన్నారు.

## దివ్యాంగుడికి త్రీవీలర్ అందజేత

దివ్యాంగుడికి త్రీవీలర్ అందిస్తున్న రంగశాయిరెడ్డి

నిడమనూరు, జూన్ 1 : మండలంలోని మార్లగడ్డ తండాకు చెందిన దివ్యాంగుడు సపావత్ దీప్లానాయక్‌కు లహరిరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బ్యాటరీతో నడిచే త్రీవీలర్‌ను శనివారం కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు యడవల్లి రంగశాయిరెడ్డి చేతుల మీదుగా అందించారు. దివ్యాంగుడి పరిస్థితి చూసి చలించిన యూత్ కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు ఎడవల్లి వల్లభ్‌రెడ్డి ఫౌండేషన్ ద్వారా తుమ్మడం గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో త్రీవీలర్‌ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు అంకతి సత్యం, నాయకులు నందికొండ మట్టారెడ్డి, ముంగి శివమారయ్య, కూకుట్ల యాదగిరి, సైదులు, బుట్టి వెంకన్న, మంగు నాయక్ పాల్గొన్నారు.

## నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు : ఎస్ఐ

హాలియాలో విత్తన దుకాణాలు తనిఖీ చేస్తున్న ఎస్ఐ సతీశ్‌రెడ్డి, వ్యవసాయ అధికారులు

హాలియా, జూన్ 1 : రైతులకు నకిలీ విత్తనాలు విక్రయించే వ్యాపారుల లైసెన్స్ రద్దు చేయడంతో పాటు చట్టరీత్య చర్యలు తీసుకుంటామని హాలియా ఎస్ఐ సతీశ్‌రెడ్డి హెచ్చరించారు. శనివారం మండలంలోని కొత్తపల్లి రైతువేదికలో విత్తన డీలర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వ్యవసాయశాఖ అనుమతి పొంది, లైసెన్స్ కలిగిన వ్యాపారులు ప్యాకంగ్ ఉన్న విత్తనాలను మాత్రమే ఎమ్మార్పీకి విక్రయించాలని సూచించారు. అనంతరం వ్యవసాయశాఖ ఏడీఏ, ఏఓతో కలిసి హాలియాలోని పలు ఫర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేశారు. కార్యక్రమం వివిధ మండలాల ఏఓలు జానికిరాములు, పార్వతీ చౌహాన్, మాధవరెడ్డి, సందీప్‌కుమార్, విజయ్‌చందర్, విత్తన వ్యాపారులు పాల్గొన్నారు.

## పాఠశాలలు ప్రారంభించేలోపు పనులను పూర్తిచేయాలి

● ఎంపీడీఓ శేషగిరిశర్మ

కురియాతండా పాఠశాలలో జరుగుతున్న పనులను పరిశీలిస్తున్న ఎంపీఓ

మిర్యాలగూడ, జూన్ 1: పాఠశాలలు పునఃప్రారంభమయ్యేలోపు అభివృద్ధి పనులను పూర్తి చేయాలని ఎంపీడీఓ శేషగిరిశర్మ సూచించారు. శనివారం మండలంలోని కురియాతండాలోని ప్రాథమిక పాఠశాలలో చేపడుతున్న అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. తరగతి గదుల్లో ఫ్యాన్లు, లైట్లు, తాగునీటి వసతి, టాయ్‌లెట్స్ నిర్మాణ పనులు వెంటనే పూర్తి చేయాలన్నారు. ఆయన వెంట సహాయ ఇంజినీర్ ఆదినారాయణ, గ్రామ కార్యదర్శి ఉన్నారు.

## డీసీఎం డ్రైవర్‌ను కొట్టి రూ.22వేలు చోరీ

నార్కట్‌పల్లి, జూన్ 1 : డీసీఎం డ్రైవర్‌ను కొట్టి, తాళ్లతో బంధించి అతడి వద్ద ఉన్న రూ.22వేలను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తెకెళ్లిన ఘటన మండలంలోని ఏపీ లింగోటం గ్రామ శివారులో శనివారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. ఎస్ఐ అంతిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కనగల్ మండలం బచ్చన్నగూడెం గ్రామానికి చెందిన జడిగల ఎల్లేశ్ తన డీసీఎంకు తానే డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఖమ్మం జిల్లా కల్లూరులో కట్టె మొద్దులను లోడ్ చేసుకొని హైదరాబాద్‌కు బయల్దేరాడు. తెల్లవారుజామున మార్గ మధ్యంలో ఏపీ లింగోటం శివారులోకి రాగానే ఇద్దరు మహిళలు రోడ్డు పైనుంచి టార్చి లైట్‌తో సిగ్నల్స్ ఇచ్చారు. దాంతో అతను వాహనాన్ని రోడ్డు పక్కన ఆపి, డీసీఎం దిగి వారితో మాట్లాతుండగా ఇద్దరు వ్యక్తులు వెనుక నుంచి వచ్చి ఎల్లేశ్‌ను కాళ్లుపట్టిలాగి కింద పడేశారు. పడవేశారు. ప్లాస్టిక్ వైర్‌తో కాళ్లు, చేతులు కట్టేశారు. అతడిపై కూర్చొని డబ్బులు ఎక్కడ పెట్టావని ప్రశ్నిస్తూ ముక్కుపై పిడిగుద్దులు గుద్దారు. అతడి మొబైల్ ఫోన్‌ను పగులగొట్టారు. వారిలో ఒకరు డీసీఎంలో సోదాలు నిర్వహించి టూల్ బాక్స్‌లో ఉన్న రూ. 22వేలు తీసుకున్నాడు. తర్వాత ఎల్లేశ్‌ను కొంత దూరం తీసుకెళ్లి చిన్న కాలువ వద్ద పడేసి, కట్లు విప్పుకుంటే నీ సంగతి చూస్తామంటూ హెచ్చరించి వెళ్లిపోయారు. తర్వాత నోటితో కట్లను విప్పుకున్న ఎల్లేశ్ నార్కట్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## 3న కేవీకేలో కిసాన్‌మేళా

త్రిపురారం, జూన్ 1: ఈ నెల 3న మండలంలోని కంపాసాగర్ కృషి విజ్ఞాన కేంద్రంలో కిసాన్ మేళా నిర్వహించనున్నట్లు కేంద్రం కోఆర్డినేటర్ ఎస్. శ్రీనివాస్‌రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు అధిక సంఖ్యలో హాజరై మేళాను విజయవంతం చేయాలని కోరారు.

## వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ కమిటీ ఎన్నిక

నకిరేకల్, జూన్ 1 : పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయ కమిటీని శనివారం ఆలయ ఆవరణలో కంచర్ల బ్రహ్మచారి అధ్యక్షతన ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మోపూరి చంద్రమౌలి, ఉపాధ్యక్షులుగా సంకోజు నారాయణ, నాగోజు శ్రీనివాసచారి, ప్రధాన కార్యదర్శిగా సిద్ధోజు భిక్షమాచారి, కోశాధికారిగా తాటికొండ లక్ష్మయ్య, మహిళా కార్యదర్శిగా తోమిటి గోవిందమ్మ, సహాయ కార్యదర్శిగా మోరోజు ధనుంజయచారి, సంయుక్త కార్యదర్శిగా బహురోజు రాంబ్రహ్మచారితో పాటు ధర్మకర్తలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారులుగా చౌడోజు వెంకటేశ్వర్లు, తాటికొండ సత్యనారాయణ వ్యవహరించారు.

## భక్తిశ్రద్ధలతో హనుమాన్ జయంతి

● జిల్లా వ్యాప్తంగా ఆంజనేయుడికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు

ముషంపల్లి ఆలయంలో హోమం నిర్వహిస్తున్న భక్తులు

గుడిపల్లిలో భక్తాంజనేయస్వామి ఆలయంలో స్వామివారి పల్లకీసేవ నిర్వహిస్తున్న భక్తులు

రామగిరి, జూన్ 1: హనుమాన్ జయంతి వేడుకలు శనివారం జిల్లా వ్యాప్తంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పల్లె నుంచి పట్నం వరకు హనుమాన్, సీతారామచంద్రస్వామి ఆలయాల్లో ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు చేపట్టారు. జిల్లా కేంద్రంలోని తులసీనగర్ భక్తాంజనేయస్వామి ఆలయం, వీటీ కాలనీ సెంటర్‌లోని పంచముఖ హనుమాన్ దేవాలయం, రామగిరిలోని సీతారామచంద్ర స్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. ముశంపల్లి రోడ్డులోని మారుతీ మందిర్, పాతబస్తీ హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. గుడిపల్లిలోని అతిపురాతన భక్తాంజనేయస్వామి ఆలయంలో గణపతిపూజ, నవగ్రహ ఆరాధన తోపాటు ప్రత్యేకపూజలు నిర్వహించారు. సాయంత్రం హనుమాన్ పారాయణం, పల్లకీ సేవ, ఊరేగింపు నిర్వహించారు.

## అమరవీరులకు నివాళి

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం హైదరాబాద్‌లో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో గన్‌పార్క్ అమరవీరుల స్తూపం నుంచి ట్యాంక్ బండ్ వద్ద గల అమరజ్యోతి వరకు క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చాడ కిషన్‌రెడ్డి, దూదిమెట్ల బాలరాజ్‌యాదవ్

## గ్రూపు-1 ప్రిలిమినరీ పరీక్షకు ఏర్పాట్లు చేయాలి

● ఆన్‌లైన్‌లో అందుబాటులో అభ్యర్థుల హాల్‌టికెట్లు

● స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పూర్ణచంద్ర

గ్రూప్ 1 పరీక్షల సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ పూర్ణచంద్ర

నల్లగొండ జూన్ 1: ఈ నెల 9న నిర్వహించనున్న గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ టి. పూర్ణచంద్ర ఆదేశించారు. గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షల నిర్వహణ విషయమై శనివారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన కో-ఆర్డినేషన్ కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరుగనున్న గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షకు జిల్లా వ్యాప్తంగా 47 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు, 16,899 మంది పరీక్షకు హాజరుకానున్నట్లు తెలిపారు. అభ్యర్థులకు అసౌకర్యం కలుగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లుగా సంబంధిత కళాశాలల, విద్యాసంస్థల ప్రిన్సిపాల్స్‌ను నియమించామని, పరీక్ష నిర్వహించే అన్ని కేంద్రాలకు కలిపి తొమ్మిది రూట్లు ఏర్పాటు చేశామని తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద 144వ సెక్షన్ విధించాలని, అభ్యర్థులు ఉదయం 10 గంటల లోపే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని, ఆ తర్వాత వచ్చిన వారిని అనుమతించరని పేర్కొన్నారు. ఆర్డీఓ, తాసీల్దార్లు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేయాలని, పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. పరీక్ష కేంద్రంలోకి మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులు అనుమతించరన్నారు. అభ్యర్థులు బూట్లు కాకుండా చెప్పులు మాత్రమే వేసుకోవాలని సూచించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ద్వారా అన్ని కేంద్రాల వద్ద అత్యవసర వైద్య సేవలు అందించే విధంగా ఏర్పాట్లు చేయాలన్నారు. ఆర్టీసీ అధికారులు అవసరమైన బస్సులను నడిపించాలన్నారు. అభ్యర్థులు హాల్ టికెట్లను http:// www.tspsc.gov.in ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చని సూచించారు. పరీక్ష పూర్తయ్యేంత వరకు అభ్యర్థులు పరీక్ష కేంద్రం వదిలి వెళ్లకూడదన్నారు. సమావేశంలో అదనపు ఎస్పీ రాములునాయక్, ఆర్డీఓ రవి, డీఎస్పీ శివరామ్‌రెడ్డి, డీఈఓ భిక్షపతి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే వీరేశానికి పలువురి శుభాకాంక్షలు


నకిరేకల్ : ఎమ్మెల్యే వేముల వీరేశంకు భారీ గజమాలతో శుభాకాంక్షలు తెలుపుతున్న ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు

నకిరేకల్, జూన్ 1 : ఎమ్మెల్యే వేముల వీరేశం పుట్టిన రోజు సందర్భంగా పలువురు ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. శనివారం హైదరాబాద్ నుంచి వచ్చిన ఎమ్మెల్యే కనకదుర్గమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు పెద్ద ఎత్తున తరలి వచ్చి కోలాటాలు, ఆటపాటలతో పన్నాగూడెం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, అభిమానులు, కార్యకర్తలు భారీ గజమాలతో ఎమ్మెల్యే వీరేశాన్ని సత్కరించారు. ఎమ్మెల్యేలు మందుల శ్యామేల్, బత్తుల లక్ష్మారెడ్డి, మండలి మాజీ డిప్యూటీ చైర్మన్ నేతి విద్యాసాగర్ ఎమ్మెల్యే వీరేశంను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టీపీసీసీ మేనిఫెస్టో కమిటీ సభ్యుడు చామల శ్రీనివాస్, బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పూజర్ల శంభయ్య, నాయకులు దైద రవీందర్, పన్నాల రాఘవరెడ్డి, నకిరేకంటి ఏసుపాదం, బచ్చుపల్లి గంగాధర్, లింగాల వెంకన్న మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, ఎంపీపీలు పాల్గొన్నారు.

## పశువుల దొంగల అరెస్ట్

● రూ. 2.85 లక్షల నగదు, వాహనం స్వాధీనం